సాక్షి
శ్రీకాకుళం
శనివారం ၊ 9 ၊ మార్చి ၊ 2024

లింగోద్భవ వైభవం

జలుమూరు: శ్రీముఖలింగంలోని మధుకేశ్వరుని ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవ క్రతువు శాస్త్రోక్తంగా జరిగింది. పర్లాకిమిడి మహారాణి కల్యాణి గజపతి హాజరయ్యారు.


లింగోద్భవానికి ముందు..


లింగోద్భవ వేళలో..

12 నుంచి రంజాన్ మాసం ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్: ముస్లింలు అత్యంత పవిత్రమైన మాసంగా భావించే రంజాన్ మాసం ఈ నెల 12నుంచి ప్రారంభం కానుంది. ఈ మాసంలో 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేస్తారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి సాయంత్రం ఇఫ్తార్ ఆరగిస్తారు.

న్యూస్‌రీల్

నేడు కిరణ స్పర్శ దర్శనం



అరసవల్లి: అరసవల్లి సూర్య నారాయణ స్వామి ఆలయంలో అద్భుత దృశ్యానికి వేళైంది. శనివారం వేకువజామున సూర్యోదయ తొలి సూర్యకిరణాలు నేరుగా గర్భాలయంలోని స్వామి మూలవిరాట్టును స్పృశించే క్షణాలు కనిపించనున్నాయి. ఉదయం 6.10 గంటల నుంచి కొద్ది నిమిషాలు మాత్రమే ఈ కిరణ దర్శనం ఉండే అవకాశం ఉన్నందున భక్తులకు దర్శనానికి గాను ఆలయ ధ్వజస్తంభం నుంచి ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఆదివారం కూడా ఇదే విధమైన కిరణ దర్శనానికి అవకాశం ఉందని ఆలయ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లుగా వారు వివరిస్తున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ మీనా


ఆర్‌కే మీనాకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్ అడిషనల్ డీజీ ఆర్‌కే మీనా శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆయనకు గౌరవంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించి గోత్రనామాలతో ప్రత్యేకంగా పూజలు చేయించారు. ఆయన వెంట స్థానిక పోలీస్ అధికారులు, సీఐ ఎల్ఎస్ నాయుడు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి తదితరులున్నారు.

డీఆర్‌డీఏ పీడీగా కిరణ్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులుగా పి.కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విధుల్లోకి చేరారు. ఆయన రూరల్ డెవలప్‌మెంట్- పంచాయతీ రాజ్ విభాగంలో డీఎల్‌డీఓ క్యాడర్‌లో ఇప్పటివరకు డీఎల్‌డీఓగా పనిచేశారు. విజయవాడ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్న డాక్టర్ డీవీ విద్యాసాగర్‌ను ఆయన పేరెంట్ డిపార్టుమెంటు పంచాయతీరాజ్-రూరల్ డెవలప్‌మెంటు శాఖకు రిపోర్టు కావాలని ఉత్తర్వులు విడుదల చేశారు.

ముఖలింగేశ్వరుని వస్త్ర హుండీ ఆదాయం రూ.1.27 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న చైర్మన్ బీవీ రమణ తదితరులు

జలుమూరు: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శుక్రవారం శ్రీముఖలింగేశ్వరుని తాత్కాలిక(వస్త్ర) హుండీ ఆదాయం రూ. 1,27,122 వచ్చిందని ఆలయ చైర్మన్ బసవ వెంకట రమణ తెలిపారు. శివరాత్రి ఉత్సవాల్లో వస్త్ర హుండీ ఆదాయాన్ని పాలక మండలి, అర్చకులు, భక్తుల సమక్షంలో లెక్కించినట్లు ఆయన తెలిపారు.

'శివరాత్రి నాడు తెరిచిన స్కూళ్ల వివరాలివ్వండి'



శ్రీకాకుళం అర్బన్: మహాశివరాత్రి పర్వదినాన శుక్రవారం శ్రీకాకుళం జిల్లాలో ప్రత్యేక తరగతులు పేరిట తెరిచిన స్కూళ్ల వివరాలు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు అందించాలని కమిషన్ సభ్యులు గొండు సీతారాం జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే శివరాత్రి పర్వదినాన రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించినప్పటికీ కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు పెడచెవిన పెట్టి యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్నట్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధారాలతో తమ కమిషన్ దృష్టికి తీసుకురావడాన్ని సుమోటాగా స్వీకరిస్తున్నట్టు తెలిపారు. అధికారులు అందించే నివేదిక ఆధారంగా ఆయా స్కూళ్ల గుర్తింపు రద్దుతో పాటు చట్ట ప్రకారం చర్యలకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయనున్నట్లు సీతారాం తెలిపారు.

తత్ ప్రణమామి సదాశివ లింగం




కోవెల గంట గణగణమంటూ మోగుతూనే ఉంది. అర్చకుడి కంఠం హరుని నామం పలుకుతూనే ఉంది. మారేడు పత్రం శివుడిని మార్కండేయుడిలా అల్లుకుని కనిపించింది. మూడు రేఖల విభూది భక్తుల నుదుటిపై శ్వేతవర్ణంలో ప్రకాశించింది. గొంతులో జారిన గంగోదకం కంటి నుంచి ఆనంద భాష్పాలను రప్పించింది. మహాశివరాత్రి పర్వదినం భక్తులకు అవ్యక్తానుభూతులను పంచింది. అర్చన, అభిషేకం, హారతి వంటి ప్రతి క్రతువూ ఈశుని దాసులను సమ్మోహితులను చేసింది.


శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరునికి అభిషేకం


అర్ధనారీశ్వరుని రూపంలో శ్రీకాకుళం నానుబాలవీధి విజయ దుర్గ అమ్మవారు



టెక్కలి: రావివలస ఎండల మల్లన్న సన్నిధిలో భక్తజనం


ఆమదాలవలస రూరల్: సంగమేశ్వర స్వామికి పూజలు



శ్రీకాకుళంలో ఉమాజడలేశ్వరుని అలంకరణ

హే భిమ్మో..

మందస: మహాశివరాత్రి పర్వదినాన మహేంద్రగిరులకు భక్తులు పోటెత్తారు. హే భిమ్మో అంటూ పర్వత శిఖరాన్ని చేరుకుని స్వామిని అర్చించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు మందస మీదుగా సాబకోటకు చేరుకుని, అక్కడ నుంచి కాలి బాటన గిరులను ఎక్కారు. ఒడిశా ప్రభుత్వం కొయిపూర్ నుంచి రహదారి నిర్మించగా.. మందస మండలం నుంచి కూడా రోడ్డు నిర్మాణం చేస్తోంది. ఒడిశా మీదుగా వాహనాలు కొండపైకి వెళ్తుండగా, భక్తులు వాహనాలపైనే ఎక్కువగా వెళ్లారు. తూర్పు కనుమల్లో ఎత్తైన పర్వతాలుగా పేరు పొందిన మహేంద్రగిరుల్లో భీముని ఆలయం శిఖరంపై ఉంది. భక్తులు శిఖరానికి చేరుకుని, ప్రత్యేక అనుభూతి చెందారు. ఒడిశా ప్రభుత్వం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది.


భీముని ఆలయం వద్ద భక్తుల సందడి

మధుకేశ్వరుని సన్నిధిలో..


శ్రీముఖలింగంలో ఆలయం ముందు క్యూలో ఉన్న భక్తులు రద్దీ

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం శివనామ స్మరణతో మార్మోగింది. శివరాత్రి సందర్భంగా వేకువజాము మూడు గంటల నుంచి స్వామికి అర్చనలు ప్రారంభించారు. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం నుంచి భక్తుల రద్దీ పెరిగింది.

గల్లీ నుంచి ఢిల్లీకి..

- మహిళా క్రికెట్‌లో రాణిస్తున్న అక్కాచెల్లెళ్లు
- అండర్-15, అండర్-19లో ప్రతిభ కనబరుస్తున్న మన క్రీడాకారిణులు
- ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లోనే చదువులు

కంచిలి:

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో జన్మించిన ఈ ఇద్దరు అక్కాచెల్లెల్లు క్రికెట్‌లో అత్యున్నత రీతిలో రాణిస్తున్నారు. గల్లీ నుంచి ఢిల్లీ స్థాయికి ఎదిగి అండర్-15, అండర్-19 విభాగాల్లో ఆడుతూ ఈ ప్రాంతానికి మంచి పేరు సంపాదించిపెట్టారు. కంచిలి మండలం మకరాంపురం గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారుడు బొగియా కామరాజు-స్వరూపల కుమార్తెలు బొగియా సాయిదీప్తి, బొగియా సాయినిఖితలు చిన్నప్పటి నుంచే క్రికెట్ మీద మక్కువ పెంచుకున్నారు. తండ్రి కామరాజు మకరాంపురం టీంలో యాక్టివ్ క్రీడాకారుడు. ఆ క్రీడ మీద ఉన్న మక్కువ తోనే తన కుమార్తెలిద్దరికీ ఆ క్రీడలో తర్ఫీదునిచ్చి ప్రోత్సహించారు. వీరిద్దరూ ఐదో ఏట నుంచే మైదానంలో క్రికెట్ ఆడటం ప్రారంభించారు. అంచెలంచెలుగా ఆడుకుంటూ చక్కని ప్రతిభను కనబరుస్తూ ఈ రోజు జాతీయ స్థాయిలో ఆడుతూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. పెద్ద కుమార్తె సాయిదీప్తి అండర్-19 విభాగంలోను, చిన్నకుమార్తె సాయి నిఖిత అండర్-15 విభాగంలో ఆడుతున్నారు. వీరిలో సాయి దీప్తి మంగళగిరిలో గల ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం(ఎంపీసీ), రెండో కుమార్తె సాయి నిఖిత గుంటూరు ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్‌లో 8వ తరగతి చదువుతోంది. ఓవైపు చదువుకుంటూ.. మరోవైపు క్రికెట్‌లో మెలకువలు నేర్చుకుంటున్నారు.


లెఫ్ట్ హ్యాండ్ బ్యాటింగ్ చేస్తున్న సాయి నిఖిత


కుమార్తెలిద్దరితో బొగియా కామరాజు-స్వరూప దంపతులు

జాతీయ స్థాయిలో రాణింపు..

సాయిదీప్తి అండర్-19 విభాగంలో ఆడుతూ ప్రతిభను కనబరుస్తోంది. ప్రస్తుతం ఈమె జాతీయస్థాయిలోను, ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లలో ఆడుతోంది. లెఫ్ట్ హ్యాండ్ ఆఫ్ స్పిన్ బౌలింగ్‌తోపాటు రైట్ హ్యాండ్ బ్యాటర్‌గా రాణిస్తోంది.

ఇటీవల స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ మ్యాచ్‌లో 54 బంతుల్లో 117 పరుగులు, 24 రన్స్ ఇచ్చి 3 వికెట్లు తీయడంతో నిర్వాహకులు అభినందించి, షీల్డ్‌ను అందజేశారు. ఆల్ ఇండియా క్రికెట్ అసోసియేషన్ సీనియర్ వుమెన్స్ పోటీల్లో ఆరు వికెట్లు తీసుకొని మన్ననలు పొందింది. ఆంధ్రా-చండీగఢ్‌ల మధ్య జరిగిన పోటీలో సాయిదీప్తి బౌలింగ్ చేసి 7.3 ఓవర్లలో 16 పరుగులు మాత్రమే ఇచ్చి 3 వికెట్లు తీసుకుంది. సాయిదీప్తిని మకరాంపురం గ్రామస్తులు శనివారం స్థానిక శివాలయంలో సత్కరించనున్నారు.



బ్యాటింగ్‌లో మెలకువలు నేర్చుకుంటున్న సాయిదీప్తి

జోనల్ స్థాయిలో..

అండర్-15 విభాగంలో సాయి నిఖిత పాఠశాల స్థాయిలోనే చక్కని ప్రతిభను కనబరుస్తోంది. జోనల్‌స్థాయిలో రాణిస్తోంది. ఈమె లెఫ్ట్ హ్యాండ్ బ్యాటింగ్ చేయడం, రైట్ ఆర్మ్ లెగ్ స్పిన్ బౌలింగ్ చేయడంతో పాటు వికెట్ కీపర్‌గా కూడా రాణిస్తోంది. ఉద్దానం ప్రాంతంలో పేద కుటుంబానికి చెందిన క్రీడాకారుడి కుమార్తెలిద్దరూ ఇంతటి ఘనవిజయం సాధిస్తూ ముందుకెళ్లడంతో స్థానికులు సైతం హర్షాతిరేకాలు వ్యక్తపరుస్తున్నారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లుగా పదోన్నతి

- ప్రత్యేక బీఈడీ కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఛాన్స్
- 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి: డీఈఓ

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధన చేయడానికి గాను అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ టీచర్లను స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల పాఠశాలలు మండలానికి ఒకటి చొప్పున మొత్తం 30 ఉన్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు పాఠాల బోధనకు ఖాళీగా ఉన్న రోస్టర్ ప్రాప్తికిగాను పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ లేదా జనరల్ బీఈడీతోపాటు రెండేళ్ల స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డిప్లమో ఇతర అర్హతలు కలిగిన ఎస్జీటీ టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చని సంబంధిత అధికారులు స్పష్టం చేస్తున్నారు. సంబంధిత అర్హతలు కలిగిన ఎస్జీటీలు ఈనెల 10వ తేదీ ఉదయం 11 గంటలలోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని డీఈఓ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

వందేభారత్ వచ్చింది..

కాశీబుగ్గ: దేశంలో వివిధ ప్రాంతాల మధ్య నడుస్తూ వార్తలకు ఎక్కిన వందే భారత్ రైలు జిల్లా మీదుగా ప్రయాణించింది. శుక్రవారం మధ్యాహ్నం మన జిల్లాలో మూడు స్టేషన్లలో ఆపడంతో ప్రయాణికులు రైలును చూసి ఆశ్చర్యపోయారు. ఇది విశాఖ నుంచి భువనేశ్వర్‌కు ట్రయల్ రన్ కావడం విశేషం. రైలు వద్ద అనేక మంది సెల్ఫీలు దిగారు. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రయాణించనున్న ఈ వందేభారత్ రైలుకు మన జిల్లాలో ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం రోడ్డులలో స్టాపేజీ ఇచ్చారు.


పలాసలో నిలిచిన వందేభారత్ రైలు

కార్డన్ సెర్చ్

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని పెద్దరెల్లి వీధిలో ఎస్పీ ఆదేశాల మేరకు రెండో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అపరిచిత వ్యకులు గానీ, ఇళ్ల వద్ద పరిచయం లేని వ్యక్తులు గానీ సంచరిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. అరాచక శక్తులు సంచరిస్తుండడంతో ఇంటింటా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారి కుటుంబ సమాచారాన్ని సేకరించారు. ఎస్ఐ హరికృష్ణ ఆధ్వర్యంలో పోలీసుల బృందం ఇంటింటా తనిఖీలు నిర్వహించి సమాచారం సేకరించారు.కార్యక్రమంలో కేంద్ర పోలీసు బృందం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పెద్దరెల్లి వీధిలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు


పూండిలో రాత్రి కురుస్తున్న వర్షం

ఎట్టకేలకు చిరుజల్లులు

వజ్రపుకొత్తూరు: జిల్లాను చిరుజల్లులు పలకరించాయి. మహాశివరాత్రి పర్వదినాన జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాన కురిసింది. జీడి, మామిడి, కొబ్బరి, ఉద్దానం పనస పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులంటున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని పూండి బెండి, కొండవూరు, బెండిగేటుతో పాటు మండలంలో దాదాపు అన్ని చోట్లా శుక్రవారం సాయంత్రం తేలికపాటి జల్లులతో పాటు రాత్రి ఏడు గంటల నుంచి దాదాపు 15 నిమిషాల పాటు జల్లులు కురిశాయి.

క్లుప్తంగా

పాత ఆస్పత్రిలో సామగ్రి మాయం

టెక్కలి రూరల్: టెక్కలి పాత జిల్లా ఆస్పత్రిలో ఉన్న సామగ్రిని కొంత మంది యువకులు మాయం చేస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. ఆస్పత్రిలో అల్యూమినియం డోర్లు, మరికొన్ని విలువైన సామగ్రిని కొంత మంది యువకులు దొంగిలించి తరలిస్తుండగా స్థానికులు వారిని పట్టుకున్నారు. గత కొద్ది నెలలుగా ఇలా దొంగతనాలు చేస్తున్నారని స్థానికులు తెలిపారు. అయితే శుక్రవారం దొరికిన దొంగ పోలీసులు వచ్చేలోపే తప్పించుకుని వెళ్లిపోవడం విశేషం.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాద బాధితులకు సపర్యలు చేస్తున్న స్థానికులు

మందస: మండలంలోని మహేంద్రతనయ-మెళియాపుట్టి రోడ్డులో హంసరాళి గ్రామానికి సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. టెక్కలి ప్రాంతానికి చెందిన కొంతమంది భక్తులు మ్యాక్సీ క్యాబ్‌లో మహేంద్రగిరుల యాత్ర వెళ్లి తిరిగి వస్తూ.. ఇదే మండలంలోని పొత్తంగిలో గల పాత్రీశ్వరాలయానికి వెళ్తున్నారు. మందస మండలంలోని బుడంబో నుంచి ముగ్గురు వ్యక్తులు కిల్లోయి కొండపై ఉన్న శివాలయానికి దర్శనానికి వెళ్తుండగా, రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో క్యాబ్‌లో గల భక్తులకు స్వల్ప గాయాలు కాగా, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సవర రామారావు, సుబ్బమ్మ, నీలమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ప్రైవేటు వాహనంలో హరిపురం సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు రిఫర్ చేశారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి మనిషికి ఆధ్యాత్మికత అవసరం



ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న స్వాములు

మందస: ప్రతి మనిషికి ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని అఖిలాంధ్ర సాధుపరిషత్ ప్రతినిధులు చెప్పారు. మందస మండలంలోని కిల్లోయిలో గల శాంతి ఆశ్రమంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మానవ జన్మ ఉత్తమమైనదని, మాధవ సేవ చేస్తూ సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. భక్తిభావంతో ముందుకెళ్లినప్పుడు పాపభీతి పోతుందన్నారు. అనంతరం శాంతిహోమాన్ని నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. ఒడిశా, ఆంధ్రా నుంచి వచ్చిన కళాకారులు సంకీర్తనలు, భజనలు చేశారు. కేశవచంద్రదాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో రావివలస, బొగాబంద, డబ్బారు తదితర ప్రాంతాల నుంచి మాధవానందస్వామి, యోగిని లక్ష్మీబాయి, రామానందస్వామి, బాలకృష్ణదాసు, డాక్టర్ కుమార్‌నాయక్, డాక్టర్ తిరుపతిసాహు, నల్ల నీలకంఠ, రాములుపాత్రో తదితరులు పాల్గొన్నారు.

క్వారీలో జారి పడి కార్మికుడు మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన అప్పారావు

టెక్కలి రూరల్: మండలంలోని లింగాలవలస గ్రామ సమీపంలో ఉన్న ఎర్త్ స్టైన్ గ్రానైట్ క్వారీలో కట్టర్ మేస్త్రీగా పనిచేస్తున్న రవాడ అప్పారావు(44) అనే వ్యక్తి క్వారీలో జారిపడి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కోటబొమ్మాళి మండలం రేగులపాడు గ్రామానికి చెందిన అప్పారావు పొట్టకూటి కోసం టెక్కలి మండలం లింగాలవలస గ్రామ సమీపంలో ఉన్న ఎర్త్ స్టైన్ గ్రానైట్ క్వారీలో కట్టర్ మేస్త్రీగా పనిచేస్తున్నారు. శుక్రవారం క్వారీకి వెళ్లి పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి క్వారీ కింద ఉన్న రాయిపై అమాంతం పడిపోయారు. తీవ్ర గాయాలపాలైన అప్పారావును అక్కడున్న వారు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. గుండెకు బలమైన గాయం కావడంతో ఆయన మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. దీనిపై పోలీ సులకు సమాచారం అందించినా చాలా సమయం వారు రాకపోవడంతో మృతదేహాన్ని ఆస్పత్రిలోనే ఉంచాల్సి వచ్చింది. అనంతరం ఆస్పత్రికి చేరుకున్న పోలీసులు మృతుని భార్య పుణ్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు సీఐ పైడయ్య తెలిపారు. అనంతరం మృతదేహానికి శవపంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కట్టుబాట్లు దాటుకుని రండి: ఎస్పీ

పలాస:

సమాజంలో నేల నుంచి నింగి వరకు ప్రతి రంగంలో మహిళల పాత్ర ఉందని, మహిళా సాధికారిత కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఎస్పీ జీఆర్ రాధిక పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళలకు మహిళా చట్టాలు, హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. పలాస మండలం రెంటికోట యూపీ స్కూలు ఆవరణలో జరిగిన ఈ సదస్సులో ఎస్పీ రాధిక మాట్లాడుతూ మహిళలు లేని రంగం అంటూ నేడు లేదన్నారు. అయితే ఇంకా ఆయా రంగాల్లో పురుషులతో పాటు సమానత్వం రావాల్సి ఉందని చెప్పారు. కట్టుబాట్లు దాటుకుని బయటకు రావాలన్నారు. వ్యక్తిత్వ వికాసానికి విద్య చాలా అవసరమని, ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ప్రేమ మోజులో పడి మంచి భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని హితవు పలికారు. ప్రతి మహిళ వద్ద స్మార్ట్ ఫోను ఉండాలని, అందులో దిశ యాప్‌ను ఉంచుకోవాలని, ఆపద సమయాల్లో ఆ దిశ యాప్ చాలా ఉపయోగపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా అక్కుపల్లి ఆర్‌డీఎక్స్ రాజు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రాగోలు జెమ్స్ ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 300 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు అందించారు. అలాగే 100 మంది మహిళలకు చీరలు, కళాకారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రేమ్ ఖాజిల్, డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ విద్యానంద్, స్థానిక సర్పంచి శాసనపురి తిరుమల రావు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎస్పీ రాధిక



పలాస మండలం రెంటికోటలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆకట్టుకున్న థింసా నృత్యం
అదే కార్యక్రమంలో పల్లె పాటకు చిందులేసి ఉర్రూతలూగించిన సుభిక్ష



ప్రజల మధ్య కర్రసాము ప్రదర్శిస్తున్న రామలక్ష్మి

మహిళల అభ్యున్నతికి కృషి: స్పీకర్

బూర్జ: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బూర్జ మండలం పెద్దపేట గ్రామ సచివాలయంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ప్రజా ప్రతినిధులను స్పీకర్ సత్కరించారు. రాష్ట్రపతి, గవర్నర్, స్పీకర్ వంటి రాజ్యాంగ బద్ధ పదవులను మహిళలు సమర్థంగా నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నేన దీప, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, మండల వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, పీఏసీఎస్ చైర్మన్ బగాది నారాయణమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బూర్జ మండలం పెద్దపేట సచివాలయంలో ఎంపీపీ కర్నేన దీపను సన్మానిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

మహిళలకే పెద్దపీట



హిరమండలం లోకొండ గిరిజన మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: వైఎస్ జగన్ ప్రభుత్వంలో మహిళలకే పెద్దపీట వేస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని లోకొండ గ్రామంలో గిరిజన మహిళలతో కలిసి శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వేధింపులకు గురి కాకుండా దిశ వంటి కఠిన చట్టాలు తీసుకురావడమే కాకుండా, రాజకీయాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఇచ్చారని, ఉద్యోగ నియామకాల్లోనూ అగ్రతాంబూలం ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ, సర్పంచ్‌లు వి.చిరంజీవి బూడి అప్పన్న పీఏసీఎస్ డైరెక్టర్ అంగూరు భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వంగపల్లి చిన్నారావు, రెడ్డి జగదీశ్వరరవు ఎం.రామారావు, మోహన్‌రావు, వి.నరసింహరెడ్డి, కె.నరసింహ మూర్తి, ఎర్రభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

'నర్సుల సేవలు ఎనలేనివి'



శ్రీకాకుళం: వైద్యులు, నర్సులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

శ్రీకాకుళం, శ్రీకాకుళం అర్బన్: వైద్యసేవలో ముఖ్య పాత్ర నర్సులదేన ని, నర్సుల సేవలు వెలకట్టలేనివని ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్ లో శుక్రవారం న్యూశ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో మహిళాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ వైద్యశాలలో చేరిన రోగులకు వారి ఆరోగ్య పరిస్థితులకు తగిన చికిత్స చేయడానికి నర్సులు ముఖ్యమైన పాత్ర పోషిస్తారని తెలిపారు. కరోనా విపత్తు కాలంలో వీరు చేసిన సేవలు అమూల్యమన్నారు. శ్రీకాకుళం ఎస్‌ఐ మొజ్జాడ ప్రవల్లిక మాట్లాడుతూ ఏటా మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహిస్తారని, వారు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. నగరంలో ఉన్న ప్రముఖ వైద్యులకు, నర్సులకు ప్రశంసా పత్రాలతో సత్కరించి, జ్ఞాపికలను అందించారు. అలాగే ఎస్‌ఐ ప్రవల్లికను సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో న్యూశ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మెనేజర్ డాక్టర్ టి.మణికంఠరావు, ఎస్.జోగినాయుడు, క్లబ్ వ్యవస్థాపకుడు హారిక ప్రసాద్, కె.అనిల్, ఎస్.సంతోష్, మణిశర్మ, వి.వెంకటలక్ష్మి, వైద్యురాలు స్వర్ణలత, పద్మావతి, వనజాక్షి, లావణ్య, జోత్స్న, బాల నరసింహ, విజయకుమారి, లక్ష్మికాంతం, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- రాష్ట్రస్థాయి హాకీ మహిళల క్రీడా పోటీలు ప్రారంభం
- రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి పాల్గొన్న హాకీ క్రీడాకారిణులు
- 8 నుంచి 10వ తేదీ వరకు మైనంపాడులో పోటీలు నిర్వహణ

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పోటీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలు ప్రాంగణంలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న 14వ రాష్ట్రస్థాయి హాకీ సీనియర్ మహిళల క్రీడా పోటీలను మంత్రి మేరుగు నాగార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజునే మహిళల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు తన అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో జరగటం చాలా సంతోషంగా ఉందన్నారు. పోటీల్లో మహిళలు తమ ప్రతిభ చాటి రాణించాలన్నారు. తొలుత వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారిణులతో ప్రదర్శించిన పరేడ్‌లో మంత్రి నాగార్జున గౌరవ వందనం స్వీకరించారు. ఈ పోటీలు 8 నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి.

మొదటి రోజు విజేతల జట్లు వివరాలు

మొదటి రోజు నిర్వహించిన హాకీ పోటీల్లో 7 జట్లు పాల్గొన్నాయి. మొదటి మ్యాచ్‌లో కాకినాడ-ఏలూరు జట్లు పోటీపడగా కాకినాడ జట్టు విజేతగా నిలిచింది. రెండో మ్యాచ్‌లో తిరుపతి-కర్నూలు జట్లు పోటీపడగా తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. మూడో మ్యాచ్‌లో వైఎస్సార్ కడప-గుంటూరు జట్లు పోటీపడగా వైఎస్సార్ కడప జట్టు విజయం సాధించింది. నాలుగో మ్యాచ్‌లో ప్రకాశం-ఎన్టీఆర్ జిల్లాల జట్లు పోటీపడగా ప్రకాశం జట్టు విజేతగా నిలిచింది. 5వ మ్యాచ్‌లో నెల్లూరు-శ్రీకాకుళం జట్లు పోటీపడగా శ్రీకాకుళం జట్టు గెలిచింది. 6వ మ్యాచ్‌లో తిరుపతి-ఏలూరు జట్లు పోటీపడగా తిరుపతి జట్టు విజయం సాధించింది. 7వ మ్యాచ్‌లో కాకినాడ-కర్నూలు జట్లు పోటీపడగా కాకినాడ విజేతగా నిలిచిందని పోటీల నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఏపీ హాకీ అధ్యక్షుడు చాణక్యరాజు, ట్రెజరర్ థామస్ పీటర్, డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, హాకీ క్లబ్ కార్యవర్గ సభ్యులు టీ.రవి, పలు జిల్లాల నుంచి క్రీడాకారిణిలు, కోచ్‌లు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున



క్రీడాపోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

'బిజినెస్ ఎక్స్‌పో వినియోగించుకోండి'



మంత్రి ధర్మానకు మెమెంటో ఇస్తున్న ఇంజినీర్లు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బిజినెస్ ఎక్స్‌పో ఇంతటి స్థాయిలో నిర్వహిస్తే వ్యాపార, నిర్మాణ రంగాల్లో ఉన్న వారికి అవసరాలు తీరే మార్గాలు కనిపిస్తాయని, ఈ ఎక్స్‌పోను వినియోగించుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం వంటి అభివృద్ధి చెందుతున్న నగరంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఆనందదాయకమన్నారు. స్థానిక ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం క్రెడాయ్ ఏర్పాటు చేసిన బిజినెస్ ఎక్స్‌పోను ఆయన ప్రారంభించి సంబంధిత కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. పలు స్టాళ్లను సందర్శించి వాటి వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. నగరానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని, వచ్చే ఏడాది నుంచి మేలో కూడా వంశధార నీళ్లు ఇక్కడకు వస్తాయని చెప్పారు. జిల్లా కేంద్రంలో నివాసం ఉండాలని ఎందరో అనుకుంటారని, వారి ఆలోచనలకు అనుగుణంగా బిల్డర్లు రావాలన్నారు. మూడు రోజుల ఈ కార్యక్రమాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లియర్ టైటిలింగ్‌యాక్ట్ తీసుకొచ్చాం

దేశంలో ఓ చాలా మంది క్లీన్ టైటిల్ లేక నిర్మాణాలు చేపట్టలేకపోతున్నారని, అందుకే తాము క్లియర్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చామని మంత్రి వివరించారు. చాలా అధ్యయనం చేసి నీతి అయోగ్‌తో డ్రాఫ్ట్ తయారు చేయించి ఆ యాక్ట్‌ను రాష్ట్రంలో అమలు చేసేందుకు సిద్ధమయ్యామన్నారు. దీనిపై అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. నష్టం అనుకుంటే తప్పనిసరిగా చట్టంలో మార్పులు చేద్దామని చెప్పారు. హౌసింగ్‌కు కావాల్సిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మీకు అందిస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా, సుడా వైస్ చైర్మన్ చల్ల ఓబులేసు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, ఎంవీ స్వరూప్, క్రెడాయ్ అధ్యక్షులు చక్రవర్తి, దుంగ సుధాకర్, కోణార్క్ శ్రీను, సీజు, సాధు వైకుంఠరావు, చల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కంటైనర్

నరసన్నపేట: నరసన్నపేట సమీపంలో సత్యవరం ఫ్లై ఓవర్ వంతెనపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఉదయం 11 గంటల సమయంలో రాజస్థాన్‌కు చెందిన కంటైనర్ బెంగళూరు నుంచి కోల్‌కతాకు పంచదార లోడుతో వెళ్తోంది. దీని ముందు మరో లారీ ఎలక్ట్రికల్ సామాన్లతో గౌహతీ వెళ్తోంది. లారీని దాటుకుని ముందుకువెళ్లాలనే తాపత్రయంలో కంటైనర్ డ్రైవర్ లారీని ఢీ కొట్టాడు. దీంతో కంటైనర్ క్యాబిన్ మొత్తం నుజ్జునుజ్జయ్యింది. వాహనంలో ఉన్న డ్రైవర్, క్లీనర్లు సోహిల్ ఖాన్, అబిద్ ఖాన్‌లు అందులో ఇరుక్కున్నారు. పోలీసులు వచ్చి స్థానికుల సహకారంతో క్యాబిన్‌లో ఇనుప రాడ్లు కట్ చేసి ఇ రుక్కున్న వారిని తీసి నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ ఎడమ వైపు భాగమంతా ఊడి పడిపోయింది.



ప్రమాదంలో నుజ్జయిన కంటైనర్ క్యాబిన్



కేబిన్‌లో ఇరుక్కున్న వారిని బయటకు తీస్తున్న దృశ్యం

ఎస్పీ మానవత్వం

ప్రమాద సమయంలో అటుగా వెళ్తున్న ఎస్పీ రాధిక వాహనాలను గమనించి తన కారును ఆపి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చే వరకూ అక్కడే ఉండి క్షతగాత్రులను బయటకు తీసేకుందుకు స్థానికుల సహకారంతో ప్రయత్నించారు. వారు బయటకు వచ్చిన వెంటనే తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. మహిళా దినోత్సవం రోజున ఎస్పీ చూపిన మానవత్వానికి అంతా ముచ్చటపడ్డారు. ప్రమాదంపై నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్‌హెచ్ పెట్రోలింగ్ సిబ్బంది సహకారంతో రోడ్డు పైన ఉన్న వాహనాలను తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాలపై పక్కా నిఘా

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు-2024లను రాష్ట్రప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా అందుబాటులో ఉన్న సాంకేతికతను అందిపుచ్చుకుని అత్యంత పారదర్శకంగా పరీక్షలను నిర్వహిస్తోంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారుల నిఘా నడుమ పకడ్బందీగా పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇంటర్మీడియెట్ బోర్డు సూచనల ప్రకారం పరీక్ష కేంద్రాలపై అధికారులు ప్రత్యేకంగా ఫోకస్ చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా ఆర్‌ఐఓ కార్యాలయంలో డెకన్ (డీఈసీసీఏఎన్) పేరిట కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

కంట్రోల్ రూమ్ ద్వారా నిశిత పరిశీలన..

జిల్లాలోని 83 కేంద్రాల్లోని సీసీ కెమెరాలను ఇప్పటికే స్ట్రీమింగ్ చేసిన అధికారులు.. సీసీ కెమెరాల ద్వారా పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరును, ఇన్విజిలేటర్ల పనితీరు, బయటి వ్యక్తులు కేంద్రంలోకి ప్రవేశించడం, ఇతర ఏర్పాట్లను నిశితంగా పరిశీలించనున్నారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్ కోట ప్రకాశరావు ఆధ్వర్యంలో ఆర్‌ఐఓ ప్రగడ దుర్గారావు నేతృత్వంలో డీఈసీ కమిటీ సభ్యులు బొమ్మలాట శ్యామ్‌సుందర్, గూన సింహాచలం, కీర్తి తవిటినాయుడులు డెకన్ పేరిట ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఈ విధానం ద్వారా అధికారులు, స్క్వాడ్ బృందాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి, పరీక్ష కేంద్రాలకు పంపించనున్నారు.

జిల్లాలో ఆరుకు చేరిన మాల్‌ప్రాక్టీసుల సంఖ్య

జిల్లాలో జరుగుతున్న పరీక్షల్లో ఆరో రోజు ఈనెల 7వ తేదీన మాల్‌ప్రాక్టీసుకు పాల్పడుతున్న మరో ముగ్గురు విద్యార్థులు పట్టుబడగా వీరిని డీబార్ చేశారు. కోటబొమ్మాళిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరు, విక్టరీ జూనియర్ కాలేజి ఒకరు, నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరు చొప్పున మొత్తం ముగ్గురు పట్టుబడ్డారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు మాల్‌ప్రాక్టీసు కింద డీబారైన విద్యార్థుల సంఖ్య ఆరుకు చేరుకుంది.